

ఆ వీధిలో మూడిళ్ళల్లోవున్న మూడు గడియారాలు ఏక కంఠంతో 'ఏడు' అన్నాయి.

సీతమ్మకు నిజంగా ఏడుపొచ్చింది

కాలసూచన విషయంలో ఏ రెండు గడియారాలకూ ఐకమత్యం కుదరనప్పుడు మూడు కలిపి ముడివేసుకోడం ఆమెకు వింతగా కనిపించింది అంతే కాదు ఇదేదో మంచికి కాదన్న అనుమానం కూడా కలిగింది

నిజం—సీతమ్మ మనసు అల్లకల్లోలంగావుంది. ఏటుచూసినా, ఏది తల్చుకున్నా, ఏది వినిపించినా ఆమె మనసులోవుండే అనుమానం మరింత దృఢతరం కాసాగింది.

ఆ అనుమానం?. . . .

అవును ఆ యింట్లో తను ఓ వంటలక్క—కాదు—పనిమనిషి—కాదుకాదు—రెండు పూట్ల తిండి కోసం మొహం వాచిన బానిస—సీతమ్మ కళ్ళల్లో గిరుక్కున నీళ్ళు తిరిగాయి ఆరింటికే ఆఫీసు నుండి రావలసిన చలపతి ఇంకా ఇల్లు చేరుకోలేదు

ఎందుకు రావాలి?

పెళ్ళాంతో హాయిగా భరతనాట్యం చూసేందుకు పోయుంటాడు.

తనకూ ఎంతో కాలంనుండి ఒక్కగా వొక్క నాట్య ప్రదర్శన చూడాలనుంది. కాని తన మొర విన్నదెవరు? ఆశ ఆరని దీపంలాంటిది. అందుకని అడిగి చూసింది.

'అత్తయ్యా! మీకంత కోరికగావుంటే తప్పకుండా వెళ్ళండి. ఉన్నది ఒక్క టిక్కట్టు ఆయన కూడా నా కోసమని మానుకున్నారు మీరు ఒంటరిగా వెడతానంటే నా కభ్యంతరంలేదు' అంది మాలతి.

సీతమ్మ కా సమాధానం చురుక్కున తగిలింది.

'ఏదో ఆపేక్షతో 'రండి—మనం యిద్దరం వెడతాం. ముందేమిమ్మల్ని అడుగుదామనుకున్నాను కాని మర్చిపోయాను అక్కడకు వెళ్ళాక మరో టిక్కట్టు కొనుక్కుందాం' అనివుంటే ఎంత బాగుండేది?

ఆ మాటల్తో తను అమృతం తాగినట్టు ఆనందించి 'ఏదో ముసిలిముండను నా కెందుకమ్మా' ఏదో వేడుక కన్నానుగాని ! అని వూరుకునేది అంతటిలో ఆగలేదు

ఏదో విచిత్ర మృగాన్ని చూసినట్టు—ఆకాశంలో నక్షత్రాలు గంతులేసినట్టు

రామం చప్పట్లుచరచి గొంతుతేస్తూ 'బామ్మ డాన్సు చూస్తుందట! ఇది ఎనిమిదో వింత! ముసలాళ్ళు డాన్సు చూడటం ఇదే మొదటిసారిగా వింటున్నా సోదర సోదరీమణులారా!. అందరూ వినండి! అరవయ్యేళ్ళ అవ్వ పాతికేళ్ళ పడుచైంది బామ్మా! ఎంచక్కా రాములారి గుడికెళ్ళి దండం పెట్టు—పుణ్యంవస్తుంది' అనరిచాడు.

తనకు అందరూ ఎదురే .తన మనసులో వుండే బాధను గ్రహించి ఆ కోడలు తప్పు తెలుసుకుందీ? లేదు కొడుకుతో కదలిపోయింది. ఆ గుంట వెధవ పోతూ పోతూ గజం నాలుక అటు యిటూ ఆడించి వెక్కిరించి మరీ పోయాడు. వాడికూ డా తనెంత లోకువైంది!

. . . .ఎప్పుడో ఒకసారి తన మరిది కొడుకు అలా చేస్తే వీపు చిట్లకొట్టింది. ఆయనకూడా తన శిక్ష సమంజసమైందని తీర్పిచ్చారు. కాని ఇప్పుడు? తన మాటలు గాలి మాటలు

సీతమ్మ దేవుడి గదిలో దీపం వెలగించింది. చీకటి కరగి మనసులో గడ్డ కట్టుకుంది ఏడుకొండలవాడి పటంకేసి చూసింది. కొంటెగా నవ్వాడు. తను తిరుపతికి వెళ్ళాలని ఎంతకాలంగా అనుకుంటోంది! ఈ ఒక్క కోరికను అర్చేవారూ తీర్చేవారూ ఎవరు? చలపతి ఒకోసారి ఒకో సాకు చెప్తాడు అన్నీ దొంగసాకులు

ఒకసారి తనకు శెలవు దొరకదంటాడు.

మరోసారి పెళ్ళానికి వంట్లో బాగా లేదంటాడు.

ఇంకోమాటు చలి కాలమంటాడు

ఇలా డొంక తిరుగుడుగా చెప్పేదానికంటే, కుండబద్దలు కొట్టినట్టు 'కాదం'టే ఎంత బాగుండేది!

ఏడున్నరైంది. ఇంకా చలపతి రాలేదు. ఎందుకొస్తాడు? పెళ్ళాన్ని డాన్సుకు పొమ్మని, తను మాత్రం ఇంటిదగ్గిరుండగలడా? ఆఫీసునుండి తిన్నగా వెళ్ళుంటాడు. ఇదంతా ఓ చక్కటి నాటకం.

సీతమ్మ అరుగుమీద వచ్చి కూర్చుంది.

అప్పుడే సినిమాకు వెడుతున్న లక్ష్మమ్మ కనిపించి పలకరించింది.

'ఏవమ్మా . .వస్తావా సినిమాకు? నా కెందుకురా అంటే వాడు వింటాడా? నువ్వు లేకపోతే నే నా వెళ్ళనంటాడు వాళ్ళెలాగైనా ఒప్పించువచ్చునుకాని ఆ కోడలు? . .అమ్మ నాయనోయ్ ఆవిడ ఆపేక్ష నన్ను చంపేస్తుందంటే నమ్మ. . రాములవారి కథట వచ్చి తీరాలని మొండి పట్టు—మరి నీమాట?'

సీతమ్మకు తనివి తీర ఏడవాలనిపించింది. అతికష్టంమీద పొంగివస్తున్న కన్నీటి నాపుకుంది.

'అదృష్టవంతురాలివి! చెప్పినట్లాడే కొడుకూ కోడలు—అంతకంటే ఏం కావాలి? . . .నా గతి చూడు. నన్నింట్లో కాపలాపెట్టి అందరూ డాన్సుకు పోయారు. నేను వస్తానంటే ఆ చిన్న

వేళవ కూడా ఎగతాళి చేస్తున్నాడు....మరేపోనీ. నీకు ఆలస్యమవుతూంది లెట మొదలెట్టేస్తారు. త్వరగా వెళ్ళమ్మా!'

'అవును పాపం! ఎప్పుడూ ఏదైనా పనిచేస్తూనే వుంటావు. ఇలా తీరిగ్గా కాళ్ళు చాపుకుని కూర్చోటం నేను చూసి ఎరుగను' అంటూ లక్ష్మమ్మ కదిలింది సీతమ్మ ఆలోచనలో పడింది.

ఉదయం అయిదు గంటలకు నిద్రలేవాలి. 'ఎందుకత్తయ్యా! ఇంత పెందలాడే లేస్తారు?' అని కోడలంటుంది అదంతా పైపైకే. లోపలంతా కల్మషమే! చలపతి కూడా పెళ్ళాం మాటలు చిలకలా పలుకుతాడు పది గంటల దాకా వూపిరాడనంత పని- వొంట రామజపం చేసుకునేసరికి కళ్ళు తిరుగుతాయి రెండు మెతుకులు తినేసరికి మధ్యాహ్నం టిఫినుకోసం ఆరాటాలు—ప్రయత్నాలు. సాయంత్రం మళ్ళీ వంట కోడలికి కాస్త పనిచేస్తే ఆయాసం ముంచుకొస్తుందట—అంత పొగరైన, సున్నితమైన మనిషి. అప్పుడప్పుడు చలపతి పనిమనిషిని పెట్టుకోమంటాడు. ఆమెగారు వెంటనే గ్రామఫోను రికార్డులా 'అబ్బే! ఎందుకు లెద్దురూ! పనిమనిషి తిన్నగా పనిచేయదు అంతా మళ్ళీ నేనే చేసుకోవాలి. ఎలాగో మేమే సర్దుకుంటాం' అంటుంది

ఇదంతా చాకచక్యంతో ఆడుతున్న నాటకం పిచ్చి మాటలు విని మోసపోవటానికి తను పసిపిల్లా? ఆలోచించేకొలది సీతమ్మ మనసు మరింత క్షోభ పడింది.

ఏడాదికోసారి ఏ పుణ్యక్షేత్రానికైనా వెడితే కాస్త మనశ్శాంతైనా వుంటుంది కాశీ రామేశ్వరాలకు తీసికెళ్ళమనటంలేదు ఇంత దగ్గర్లోవున్న తిరుపతికి కూడా తీసికెళ్ళనంటాడు

మూడు గడియారాలూ ఒకసారి ఎనిమిది కొట్టాయి

'నేటి నాటకం ఏమీ బాగాలేదు' అనుకుంది సీతమ్మ.

చలపతి వచ్చాడు

అతన్ని చూడగానే ఆమె కోపంతా జారిపోయింది. కన్నకడుపు కదా మరి—పొద్దుట్నుంచి అలసి సొలసిన శరీరం—ఇంతసేపూ పడిన మథనంతా మరచి ఫ్లాస్కులోవున్న కాఫీ అతని ముందు వుంచింది

'డాన్సుకు వెళ్ళారా?' అన్నాడు కాఫీ తాగుతూ.

సీతమ్మ సమాధానం ఇవ్వలేదు

చలపతి ఆశ్చర్యంగా తల్లి ముఖంకేసి చూశాడు. తుఫానుకు ముందు ప్రశాంతంగా వుండే సముద్రం జ్ఞాపకాని కొచ్చింది

మౌనంగా బాత్‌రూంవేపు దారి తీశాడు.

* * *

రాత్రి తొమ్మిదిన్నర.

చలపతి భోజనం ముగించి పేపరు చదువుకుంటున్నాడు సీతమ్మ అతని ఎదురుగా గోడ కానుకుని కూర్చుంది. లక్ష్మమ్మ సాయంత్రం అన్న మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. ఆమె మనసు, కొండలు, నదులు, లోయలు, అడవులు దాటి ఏదో విచిత్ర ప్రదేశానికి చేరుకుని స్థిరంగా నిలిచింది

'అయితే మరి తిరుపతి ఎప్పుడ్రా వెళ్ళడం?' అంది.

# సీతమ్మా-కొడుకూ...

'త్వరలోనే వెడదాం.' అన్నాడు పేపరు చదువుకుంటూ.

'ఈ మూడేళ్ళుగా అదేమాట అంటున్నావు. నేను బతికుండగా నువ్వు తీసికెడతావన్న నమ్మకం నాకులేదు నేను పోయాక నీకా బుద్ధి పుట్టినా మాత్రం ఏం లాభం?'

చలపతి తెల్లబోయాడు సీతమ్మ ఇంత కటువుగా మాట్లాడగా అతనెప్పుడూ వినలేదు

'అదేమిటమ్మా? ఇవేళ చిత్రంగా మాట్లాడుతున్నావ్? పరిస్థితులు కొంచెం ఆలోచించు. నాలుగు నెలల క్రితమేకదా దానికి వంట్లో బాగా లేదని సెలవు తీసుకున్నాను—మళ్ళీ ఇప్పుడు సెలవెలా దొరుకుతుంది. ఏడు కొండలవాడు అనుగ్రహించినప్పుడు తప్పకుండ వెడదాం—'

సీతమ్మ ఏదీ విన దలుచుకోలేదు ఆమె ఎప్పుడో నిర్ణయానికి వచ్చేసింది

'చూడు నాయనా! ఈ అడ్డంకులు తీరుతాయని నే ననుకోను ఏదో ఒకటి అడ్డొస్తూనే వుంటుంది కనక నేను ఒంటరిగా వెడతామనుకుంటున్నాను'

చలపతి తుళ్ళిపడ్డాడు

'నీకేమైనా మతిపోయిందా? పక్కవూరి కన్నా వెళ్ళే ధైర్యం లేదు అంత దూరం ఒంటరిగా వెడుతుందట!'

సీతమ్మ చలించలేదు

'ఎంతమంది వెళ్ళటంలేదూ? నలుగురితో పాటు నేనూ—నేను వయసులో వున్నానా? లే ఒంటిమీదా నగలున్నాయా? నాకేం భయం?'

'అందుకు నేను ఒప్పుకోను ఏది కావస్తుంది నువ్వు వెళ్ళి పడుకో వాళ్ళు వచ్చేదాకా నేను మేలుకుంటానులే!'

చలపతి మళ్ళీ పేపరు చదవబోయాడు

అంతే - సీతమ్మ విరుచుకుపడింది.

'నువ్వు ఒప్పుకునే దేమిట్రా? నీ దగ్గర జీతానికున్న నౌకర్ననుకున్నావా? అవును అదీ నిజమే అంతా నాకు తెలుసు. నేను ఒక్కరోజు ఇంట్లో లేకపోతే ఈ చాకిరీ అంతా ఎవరు చేస్తారు? పాపం! నీ పెళ్ళాం పళ్ళు పంచవలసి వస్తుందని నీ భయం ఇంకా నావల్లకాదు నేను రేపుదయం బండికే వెడుతున్నా ఎవరువద్దన్నా ఆగేదిలేదు."

చలపతి మాట్లాడలేదు తల్లి మనసు అగ్ని పర్వతం లాంటిదని అతనెప్పుడూ వూహించలేదు.

'సరే! నీ ఇష్టం—నిజం నిలకడమీదకాని తెలియదంటారు. ఇప్పుడు నేనేం చెప్పినా నీకు అర్థం కాదు నువ్వు చూస్తున్న కోణంలోంచి అన్నీ నీ అభిప్రాయాల కనుగుణంగానే కనిపిస్తాయి!'

'నేను రెండుమూడు రోజుల్లో తిరిగి వస్తా ననుకోకు ఆ ఏడుకొండలవాణ్ణి తనివితీరా చూసి నెలరోజులు పోయాక వస్తాను!'

డాన్సుకు వెళ్ళిన తల్లీ కొడుకూ తిరిగివచ్చారు.

సీతమ్మ నిర్ణయం విన్న మాలతి ఆశ్చర్యపోయి తేరుకుని 'అదేమిటత్తయ్యా! ఒంటరిగా ఎలా వెడతారు?......నేనూ వస్తాను' అంది.

'నేనూ వస్తాను......' అంటూ రాము ఎగిరి గంతులేశాడు.

సీతమ్మకు అందర్నీ నమిలి మింగేయాలన్నంత కోపం వచ్చింది ఏ కొన్నాళ్ళైనా ఈ రొంపిలోంచి బయటపడి హాయిగా వుందామనుకుంటే, జలగల్లా పీల్చేందుకూ? .. తన వెంట ఎవరూ రానక్కర్లేదని గర్జించింది

* * *

సీతమ్మ తిరుపతి స్టేషనులో అడుగు పెట్టేసరికి ఒంటిగంట దాటింది ఎంతకాలం నుండో కళ్ళారా, మనసారా చూసి ఆనందించాలని తహతహలాడిన ఏడుకొండలవాడు తన కెంతో సన్నిహితుడైపోయాడు. ఆమె మనసు భక్తి పారవశ్యంతో పొంగి పొరలింది నెత్తి మధ్యాహ్నమైనా నిర్మలమైన చల్లగాలి స్వాగతం పలికింది అంతా కొత్త—సీతమ్మ స్టేషనులో అలాగే నిలబడి నాలుగు వైపులా చూసింది.

'టికెట్ ' అన్నాడు టి సి

సీతమ్మను చూడగానే ఆమె టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసిందన్న భావం అతనికి కలిగినట్లుంది

దూరంగా కనిపించే కొండలవంక చూస్తున్న సీతమ్మకు అతనిమాట వినిపించలేదు

'టికెట్ చూపించమ్మా' అని గద్దమాయించాడు.

'అలా అరుస్తా వెందుకు నాయనా? .. నాకేమన్నా చెముడనుకున్నావా? దేవుడి దర్శనానికి కోసం ఇంతదూరం వచ్చిన దాన్ని నీ దృష్టి అయిదు రూపాయల టిక్కెట్టైనా లేకుండా వస్తాననుకున్నావా?'

రెండు నిముషాలు వెతికినా ఆ సంచీలో కవరు కనిపించలేదు సీతమ్మ కంగారుపడి పోయింది. చలపతి ఇచ్చిన రెండువందల రూపాయలు, ఆ టిక్కెట్టు కవరులో పెట్టి సంచిలో భద్రపరచింది. పదిసార్లు వెతికినా ఫలితం శూన్యం.

రైల్లో నమ్ముంటే ఎవరో కాజేసి వుంటారు. ఇప్పుడేం దారి?... .

'ఇంక చాలు ఈ నాటకం కట్టిపెట్టి జరిమానాతో సహా డబ్బు చెల్లించు. టిక్కెట్టు లేకుండా రావటం చాలక మర్యాదస్తురాల్లా మాటలు కూడానా?' అని హుంకరించాడు

తనకు జ్ఞానం వచ్చినప్పట్నుంచి సీతమ్మ ఈనాటివరకూ ఇలాంటి నిష్ఠూరమైన మాటలు పడలేదు ఆమెకు ఏడుపు ముంచుకొచ్చింది . కాని ఏడుస్తే మాత్రం ఆ కవరు ఎగిరొస్తుందా? మరోసారి సంచీ అంతా గాలిస్తే ఆ కవరు దొరికింది విజయగర్వంతో టి సి కేసి చూసి, 'ఇదుగో! నీ దిక్కుమాలిన టిక్కెట్టు' అని చూపించబోయి మూర్ఛపోయినంత పని చేసింది. అది ఖాళీ కవరు! ఆ దొంగ తనమీద దయతల్చి ఉన్నదంతా దోచుకుపోవటం న్యాయంకాదని, కవరు మాత్రం వదిలిపోయినట్లున్నాడు.

'ఏమమ్మాయ్! .. ఈ రైలు నీ సొంతమైనట్టు ప్రయాణం చేయటం చాలక నా టైమంతా వేస్ట్ చేస్తున్నావు డబ్బు ఇస్తావా, లేక జైలుకు పంపించమంటావా?'

టి. సి. కి సమాధానం తోచలేదు. ఒకవేళ ఈ ముసిలాండ పి చ్రదేహాన్ని అనుమానం కూడా కలిగిందేమో?

'వెంకటేశ్వరస్వామీ! నన్ను నరక సముద్రంలో ముంచేశావు. ఒకవేళ ఇతను నన్ను కనికరించి వది లేసినా ఇల్లు చేరుకుని కొడుకూ కోడలి మొహాలు ఎలా చూడగలను?' అని సీతమ్మ లోలోన కుమిలి పోయింది.

'నా దగ్గర పైసాకూడా లేదు. నా దగ్గరున్న రెండువందలూ ఎవరో దొంగలించారు'

టి. సి. అట్టహాసంగా నవ్వాడు.

'ఆమె ఎంతివ్వాలండి?'

ఆ మాటలు విని ఆశ్చర్యపోయి ఇద్దరూ వెనక్కి తిరిగిచూశారు.

పొడుగ్గా, నాజూగ్గా, అందంగా, ఆకర్ష ణీయంగా వో యువకుడు పంట్లాం జేబుల్లో చేతులు పెట్టుకుని ఠీవిగా నిలబడ్డాడు నవ్వుతూ. అతని టెరిలిన్ పాంటు, చొక్కా, తళతళ మెరిసే బంగారు వాచీ—వైనట్ చెయిన్, ఖరీదైన కాన్వాస్ చెప్పులు అన్నీ అతని ఆర్థికౌన్నత్యాన్ని ఎత్తి చూపాయి.

'వాళ్లాడరేమండి?......ఆవిడ ప్రయాణ బడ లికలో ఎంతో యిబ్బంది పడుతోంది. అనవసరంగా నిల బెట్టి కాలయాపన చేయకండి—'అంటూ పర్సు తీశాడు. టి. సి. రావలసిన డబ్బు తీసుకుని రసీ దిచ్చాడు.

తన మొరాలకించి తిరుపతి వెంకటేశ్వరుడే ఈ యువకుడి రూపంలో వచ్చాడని సీతమ్మ నిర్ణ యించుకుంది. అతని ముందు సాష్టాంగ పడాలను కుందికూడా.

'రండి పోదాం!....పాపం, మధ్యాహ్నం భోజనం కూడా చేసివుండరు!'

'ఏవో ప్రశ్న అడగాలనుకుందికాని, ఒక్క మాటైనా పెగలలేదు.

'ఎవరు నాయనా నువ్వు?..... ఆ దేవుడే వచ్చి కాపాడాడు.....' అంది చివరికి.

ఆ యువకుడు తీయగా నవ్వాడు.

'అలాంటి దేవీ లేదండి......, భారతదేశంలోని యాభై కోట్ల జనాభాలో నే నొకణ్ణి. ఇవేళ కాలేజీకి సెలవు. ఏం తోచక ఇలా వచ్చాను....

ఆ టి. సి. సింహంలా గర్జించడం, మీరు గజగజ వణకటం చూశాను. నా వల్లనైన సాయం చేద్దా మని ......'

అయస్కాంతం లాగినట్టు ఆమె అనుసరించింది. చేతిలోవున్న సామాను మాయమైంది. రెండు రోజులుండి దర్శనం చేసుకోకతప్పదు. ఎంత ఖర్చైంది తెలుసుకుని ఆ అబ్బాయికి మణి ఆర్డరు చేసేస్తే సరి. ఆ పరిస్థితుల్లో అతని సాయం తప్పించు మరో గత్యంతరంలేదు.

* * *

సీతమ్మ ఆ అబ్బాయి పేరడిగి తెలుసుకుంది. రమణట —నిజంగా ఆ తిరుపతి వెంకట రమణే! . సత్రంలో గది కుదిర్చాక వంటకావలసిన వెచ్చా లిప్పి తెచ్చాడు. వంట పనిలో సాయపడ్డాడుకూడా

తృప్తిగా భోజనం చేశాక సీతమ్మ రమణ గురించి అడిగి తెలుసుకుంది, అతనిది కాకినా డట. ఇక్కడి కాలేజీ లెక్చరరుగా ఉంటున్నాడట ఇంకా సంసారసాగరంలో మునగలేదు గట్టుమీద నిలబడి మునిగి తేలుతున్న వాళ్ళనుచూసి ఆనం దిస్తున్నాడు ఉన్న ఒక్క నాలికతో అతన్ని అది శేషువులా పొగిడేసింది

'ఇవేళ్టికి విశ్రాంతి తీసుకోండి రేపుదయం దర్శనానికి వెడదాం.

'మరి నేను వస్తాను కాలేజీలో కొంచెం పనుంది!'

'అలాగే నాయనా!......పొద్దున్నే వచ్చావంటే కాస్త సాయంగా వుంటుంది!'

'మీరేం దిగులుపడకండి. మీ అబ్బాయిదగ్గర మిమ్మల్ని సురక్షితంగా అప్పగించేవరకు నాకు కంటి మీద కునుకురాదు!' అంటూ పెద్దగా నమస్క రించిపోయాడు.

రాత్రి ఎనిమిదైంది. వద్దంటున్నా రమణ కొనిచ్చిన పళ్ళు తిని నిద్ర కుపక్రమించింది. అప్పటిక్కాని ఆమెకు కొడుకు, కోడలు జ్ఞాపకానికి రాలేదు. వాళ్ళు కూడా వెంటవుంటే ఎంత బాగుం డును!

ఆ రామంగాడి అల్లరి అసహనీయమైనా, వాంఛనీయమనిపించింది...... సీతమ్మ ఉలిక్కి పడింది. ఏమిటీ విపరీతమైన ఆలోచనలు? అన్నీ మరిచి, కొంత కాలమైనా నిర్మలత్వంతో నిండిన మనసుతో నిండుగా వుండాలనికదా, తను తెగించి వచ్చింది!

రామం ఏంచేస్తున్నాడో?......ఏమో! ఏం చేస్తే తన కెందుకు?

'బామ్మా!......రాములోరు అడవికి పోవటంలో కథ ఆపేశావు......తరువాత?' అని ప్రశ్నార్థ కంగా చూసేడు ఆవునవును. ఆ కథ తనింకా పూర్తి చేయలేదు ఆమెకు తనమీద ఆకాశమంత కోపం వచ్చింది మనసును పీకనొక్కి దాచివుంచి నిద్రాదేవిని, రారమ్మని ఆహ్వానించింది

ఆ మర్నాడు—

ఏడు కొండలవాణ్ణి తనివితీరా చూడ్డానికి, ఆ దివ్య మంగళాకారుడి మోహనరూపంలో మైమరచి శాశ్వతంగా సన్నిధిలో నిలబడ్డానికి తనొక్కతే భక్తురాలా ఏమిటి? మహా ప్రవాహంలా జనం వచ్చి పడుతున్నారు. ఒక్క నిమిషం కూడా పూర్తిగా దర్శనం దొరక్కపోయినా, తళుక్కున మెరసిన మెరపు ఆమెలోని అజ్ఞానాంధకారాన్ని అంతరింప జేసినట్లనిపించింది.

అక్కడ ప్రకృతి సౌందర్యం ఆత్మకు పంచ రంగులు పూసింది.


'ఇక సాయంత్రం కనిపిస్తానండి ' అన్నాడు రమణ.

'పాపం!..... .నాకోసం చాలా శ్రమపడుతున్నావు. ఇవేళ కూడా కాలేజీకి సెలవేనా?'

'మీరలా మాటి మాటికీ అంటే నాకు చెడ్డ కోపం వస్తుంది సుమండి ఇది నా కర్తవ్యమని ముందే చెప్పాను.....ఇక్కడే వుండునుకాని, టైముకు వెళ్ళకపోతే హోటల్లో మంచి కూరలన్నీ అయి పోతాయి. ఏ వాడు వంకాయ కూరో మొహాన పడేసి తినమంటాడు. తప్పుతుందా మరి '

సీతమ్మ నొచ్చుకుంది ఎంతమంచి అబ్బాయి .. పెళ్ళి చేసుకుంటే అడ్డమైన తిండి తినక్కర్లేదు.. వద్దు వద్దు......అతని తల్లి హాయిగా వుండాలంటే కోడలు రాకూడదు.

'రమణా......ఈ పూట ఇక్కడే తిండువు



కాని... ...నీకు వచ్చిన కష్టాలన్నీ చేస్తాను—'

అతను ఏదో అనబోయాడుకాని, సీతమ్మ అధికార ధోరణిలో తుంచివేసింది.

'మా అబ్బాయిలా నువ్వు కూడా దొంగ సాకులు చెప్పటంలో ఆరితేరినవాడిలా కనిపిస్తున్నావు......నా సహాయ నువ్వు విని తీరాల్సిందే!'

రమణ నవ్వుకున్నాడు.

'ఇప్పటికి పది పన్నెండుసార్లు మీ అబ్బాయి గురించి, పరాయివాడినైన నా ముందు ఏవేవో ఫిర్యాదులు చేశారు. ఇంతకూ ఆయన చేసిన తప్పిదం?'

'పరాయివాడా?......ఎవరన్నారు? నువ్వు నా కన్న కొడుకుకంటే మనసుకు నచ్చావు నాయనా!.... నీలాంటి కొడుకునుకన్న మీ అమ్మ అదృష్టవంతురాలు.'

'ఇంతకూ మీ అబ్బాయి చేసిన తప్పిదమేమిటో చెప్పారుకారు......మీ కభ్యంతరంలేకపోతే చెప్పండి చాలు. మీ కుటుంబ విషయంలో జోక్యం కలుగ జేసుకునే అధికారం నాకు ఆవగింజంతైనాలేదని నాకు తెలుసు......మనిషి మనసు బిగురుమట్టి లాంటిది. మన ఆలోచనలు, కోపతాపాలు, సుఖ దుఃఖాలు అన్నీ ఆ మట్టితో మనం తయారుచేసే రూపు రేఖలమీద ఆధారపడివుంటాయి. కొన్ని పరిస్థితుల ప్రభావంగా, ఫలానా పుల్లయ్యగారి మీద నాకు మహా చెడ్డ కోపం వచ్చిందనుకోండి. తత్ఫలితంగా నా మనసులో అనేక పరావర్తనలు జరుగుతాయి. అప్పట్లో మంచి, చెడు తెలియవు. ఒక గంటపోయాక స్థిమితంగా ఆలోచిస్తే ఆ పరిస్థితులు ఎంతవరకూ నా మనసులో ఏర్పడే అభిప్రాయాలకు దోహదం చేశాయని కాని, పుల్లయ్యగారి ప్రవర్తన సరైందా కాదాని తెలుస్తాయి. నిజమంటారా?......'

'అమ్మ నాయనోయ్!......ఏమిటో అనుకున్నాను. ఇంత చిన్న అబ్బాయి పెద్ద మనస్తత్వవేత్తలా మాట్లాడుతున్నాడు!' అని సీతమ్మ ముక్కుమీద వేలేసుకుంది.

ఆమె మనసులో వున్న బాధంతా విన్నాక రమణ విరగబడి నవ్వాడు

సీతమ్మ వినుక్కుంది.

'మీ యింట్లోవున్న ముగ్గురితోనూ మీకు జట్టు కలవలేదంటారు......ముందు మీ అబ్బాయి సంగతి తీసుకుందాం. మిమ్మల్నిక్కడకు తీసుకు రావాలంటే, సెలవుదొరకాలా అక్కర్లేదా? మీరే చెప్పండి!'

'వాడు ప్రయత్నించకుండా, సెలవు తనంతట తను వచ్చిపడిస్తుందా నాయనా?'

'ప్రయత్నించలేదని మీకెలా తెలుసు?...... తెలుసుకుందుకు మీరూ ప్రయత్నించలేదు. అంతా వూహాగానం. నిజానిజాలు తెలుసుకోకుండా ఏవో నిర్ణయాలు చేసుకుంటున్నారు.....ఇక మీ కోడలు— మీచేత ఇంటిపనంతా చేయిస్తోందన్నారు. వంట్లో శక్తి వున్నంతవరకు తన కుటుంబం కోసం కష్టపడితే తప్పేముంది?—అందులోవున్న తృప్తి, ఆనందం, మరెక్కడా లభ్యంకాదు......కాని, మీరు ఇంట్లో ఏ పనీ చేయదల్చుకోలేదని, పూర్తిగా విశ్రాంతి కావాలని ఎప్పుడైనా ప్రకటించారా?.... మీ అభిప్రాయం తెలిశాక కూడా వాళ్ళు మిమ్మల్ని హింసిస్తే మీరన్నది సరేనని ఒప్పుకుంటాను....'

'ఉపన్యాసం అయిందా నాయనా?' అని సీతమ్మ అడ్డుపడింది.

'కాస్త ఓపిక పట్టండి. ఒకటి రెండు పాయింట్లుమాత్రం బాకీ వున్నాయి. మీ కోడలు కాలుమీద కాలేసుకుని మహారాణిగారిలా రత్న సింహాసనంమీద కూర్చుని ఉత్తరువు జారీచేస్తోందంటే మీతో ఏకీభవిస్తాను. మీరన్న మాటల్నిబట్టి ఆమెకూడా మీ కెంతో సాయపడుతోంది. పైగా ఆమె శరీర స్థితి గమనించాలికదా!.....అలా అనుకుంటే అందరికంటె ఎక్కువగా కష్టపడేది మీ అబ్బాయి...... పొద్దుట్నుంచి ఏ యంత్రందాకా ఆఫీసులో పని చేయటంలేదా?.....అతను కూడా బానిసేనా?......

కుటుంబంలో ఒకర్నొకరు అర్థం చేసుకుంటే ఇలాంటి తగాదాలుండవు.

మీ మనవడు కథలు చెప్పమని వేపుకుతింటున్నారంటారు. అది అనురాగంవల్లనేకదా!....'

'చాలుబాబు నీ వుపదేశం! పెళ్ళి చేసుకుని పది మంది పిల్లల్ని కన్న తండ్రిలా మాట్లాడుతున్నావు...'

సీతమ్మ ఏదో అందికాని, మనసులో కదలిక మొదలైంది.

'మరి కాళహస్తి రేపుదయం వెడదామా?...' అని రమణ ప్రసక్తి మార్చాడు.

'అప్పుడే ఏం తొందరొచ్చింది?.....నాలుగైదు రోజులుపోయాక చూద్దాం......!

'పాపం! మీ యబ్బాయి మిమ్మల్ని తల్చుకుని మీరెలా వున్నారోనని బాధపడుతూంటాడు. త్వరగా వెళ్ళటం మంచిదేమో!'

సీతమ్మ అతన్ననుమానంతో చూసింది.

'రమణా!......నువ్వు ఎంతో మంచివాడవను కొన్నాను. చివరికి నువ్వూ ఇంతేనా?.....నాకు సాయం చేయటం ఇష్టం లేకపోతే, ఆ మాటతిన్నగా అనరాదా?...... నీ కెందుకు శ్రమ— ఈ సాయంత్రం బయలుదేరుతున్నాలే'.

రమణ పెద్దగా నవ్వాడు.

'చూశారా!.... అప్పుడే పొరబడ్డారు. ....మీ కొడుకు, కోడల్ని కూడా అనవసరంగా ఇలాగే అడిపోసుకుంటున్నారు......మీకు సాయపడ్డానికే కదా నేను వచ్చింది.....ఏమైనా తప్పుగావుంటే క్షమించండి. రేపుదయం తయారుగా వుండండి. ...కాళహస్తి వెడదాం. ఎల్లుండి ప్రోగ్రాం రేపు నిర్ణయిద్దాం.

నాకు కొంచెం పనుంది. ...వెళ్తాను. తలుపు లోపల గడియపెట్టటం మరవకండి—'

*           *           *

మర్నాడుదయం రమణ వచ్చేసరికి సీతమ్మ జ్వరంతో మూలుగుతోంది. తెరచివున్న కిటికీవైపు బెదరుగా చూస్తూ వణుకుతూన్న సీతమ్మను చూసేసరికి రమణకు జాలేసింది.

'నిన్న సాయంత్రం బాగానే వున్నారే!' అన్నాడు

'మానవ జీవితం ఇంతే నాయనా!.....ఎక్కడో గడియారం పన్నెండు కొట్టింది. మెలకువ వస్తే ఒళ్ళంతా నిప్పులా వుంది. మరో గంటకు వణుకుమొదలు. తెల్లవారేదాకా వంటిమీది స్పృహలేదు బాబూ!.... దిక్కుమాలిన జ్వరం ఈ దిక్కుమాలినదాన్ని పట్టుకుంది.....అప్పుడప్పుడు అనుకునేదాన్ని. ఏడు కొండలవాడి సన్నిధిలో ప్రాణాలుపోతే బాగుండునని. వాడు 'తథాస్తు' అన్నాడు గామోలు!'

'మీకు సినరంతైనా ధైర్యం లేదండీ...... అనవసరంగా బెంబేలు పడుతున్నారు. ఇక్కడి చల్ల గాలి, వాతావరణం మీకు సరిపడి ఉండదు. అందుకే జ్వరం వచ్చింది......గోరంతలు కొండంతలు చేయకండి.....డాక్టర్ని తీసుకొస్తాను. సాయంత్రానికల్లా అంతా సర్దుకుంటుంది .... ముందు కాఫీ తెస్తాను.'

'మా అబ్బాయికి రమ్మని టెలిగ్రాం యివ్వగలవా నాయనా?'

రమణ నవ్వాపుకోలేకపోయాడు.

'మీరు చాలా విచిత్రమైనవారండీ!.....ప్రతి చిన్న విషయానికి నానార్థాలు తీస్తారు. మీ అబ్బాయికి మీకు పడదుగా!......అలాంటప్పుడు అతన్ని పిలవకూడదు. నేను పరాయివాణ్ణికానని మీరే అన్నారుగా!'

రమణ హోటల్నుంచి కాఫీ తెప్పించాక డాక్టర్ను కోసం వెళ్ళాడు.

సీతమ్మ నిజంగానే హడలిపోయింది. తన కొడుకును ధిక్కరించి రావటం తప్పేమోననిపించింది... కొడుకూ, కోడలూ దగ్గరవుంటే ఎంత బాగుండును!........మనసుకు కాస్త ధైర్యం వచ్చేది. రమణ మంచివాడేకాని, పాపం, తనకు సపర్య చేయగలడా?.......తనకు వైద్యం చేయడువస్తే?.... తను పట్టి పిరికిపందని కోడలు అప్పుడప్పుడు హేళన చేసేది.

సీతమ్మకు హఠాత్తుగా ఉదంతం జ్ఞప్తికొచ్చింది. ఏడాది క్రితం తనకోమాటు జ్వరం వచ్చింది. అయిదారు రోజులదాకా తగ్గలేదు. చలపతి సెలవుపెట్టి ఎప్పుడు తన దగ్గరే వుండేవాడు.....మా త్రం?

అహర్నిశలూ సపర్యలు చేసింది. ఒక్కమాటి విరుపు—కళ్ళు చిట్లింపులేవు. నవ్వుతూ ఆప్యాయత ఒలకబోసింది. ఆ కుర్రవెధవ మాత్రం? తనకోసం పుస్తకాల్లో కథలు చదివేవాడు. ఈ పాడు హృదయానికి తెలిసిన దింతే!

బొమ్మను సంతోషపెట్టాలన్న అభిలాష— పక్కింటి వెంకమ్మకు జ్వరంవచ్చి నాలుగురోజులు దాకా తిరుగుముఖం పట్టకపోతే ఆమె కోడలు ఇక తనవల్ల కాదని, మొగుడితో మొగాడిలా పోట్లాడి ఆస్పత్రికి పంపించేసింది.

వెంకమ్మ మరి తిరిగిరాలేదు.

రమణన్నట్లు ఎవరి కుటుంబ క్షేమంకోసం వారు పాటుపడటం బానిసత్వం ఎలా అవుతుంది? ఒకవేళ నిజంగానే చలపతికి సెలవు దొరకలేదేమో! బూటకం చప్పుడు విని సీతమ్మ ఆలోచించటంమానుకుంది.

డాక్టరు పరీక్షచేసి 'భయపడ్డానికేంలేదు, మానసికంగా బాధపడుతున్నట్లున్నారు......ఈ మాత్రలు వేసుకోండి. ఇంజక్షనిస్తాను. వాతావరణం మార్పువల్ల వచ్చిన జ్వరం' అన్నాడు.

రమణ డాక్టరుకు కృతజ్ఞత తెలియజేసి సీతమ్మ కోసం అక్కడేవుండిపోయాడు.



MTP-1-P-1-65/66 Tl.

## సీతమ్మా-కొడుకూ...

అనుకున్నట్టు సూర్యోదయానికి సీతమ్మ మళ్ళీ మామూలు మనిషైంది. సుడిగాలిలా వచ్చిన జ్వరం అలాగే తిరిగిపోయింది.

'జ్ఞానోదయం కోసం వచ్చిపడిన జ్వరం—' అనుకుంది సీతమ్మ.

'మరి కాళహస్తి ఎప్పుడు వెళదాం?' అడిగాడు రవణ.

'ఇంక నేను వెళ్ళేది తిన్నగా ఇంటికే' రవణ తెల్లబోయాడు.

'అదేమిటి? ఈమాత్రం జ్వరానికే హడలి పోతున్నారు? ఇంతదూరం వచ్చాక చుట్టు పక్కలవున్న పుణ్యక్షేత్రాలన్నీ చూడకుండ వెళ్ళ కూడదు. ఇప్పు డెలాగూ తెగించి వచ్చారు. మళ్ళీ రావటం వీలుపడదు. మీ అబ్బాయికి సెలవు దొరకదు కూడా'

'అంతటితో ఆగు—ఇంక నన్ను ఎగతాళిపట్టకు'

నేను మా వూరు వెళ్ళాల్సిందే—అప్పుడు నీ రుణం ఏమాత్రం ఎలా తీర్చుకోవాలో తెలియటం లేదు'

'అడుగో! మళ్ళీ మొదలెట్టారు' అంటూ రవణ అడ్డం వచ్చాడు.

'మనసులోవున్నమాట అనక తప్పుతుందా నాయనా? నువ్వు మరోలా అనుకోకుండావుంటే నీ ఎడ్రసు కాస్త రాసిచ్చి, నువ్వు నాకోసం ఎంత డబ్బు ఖర్చుపెట్టావో చెబితే బాగుంటుంది. నువ్వు చేసిన ఈ మహోపకారాన్ని డబ్బుతో విలువ కడు తున్నాననుకోకు. నేను నీకే విధంగానూ ప్రత్యుప కారం చేయలేను'

'అయితే మీరు ఒంటరిగా వెడదామనుకుంటున్నా రన్నమాట! ఏమండోయ్! సీతమ్మగారూ! ఈ పప్పులు నా దగ్గరుడకవు. ముందే చెప్పాను. మీ అబ్బాయిదగ్గర మిమ్మల్ని వప్పగించేదాకా, నాకు కంటిమీద కునుకురాదని'

సీతమ్మ ఇక వాదించి లాభంలేదని వూరుకుంది.

* * *

ఇంటిముందు టాక్సీ ఆగిన చప్పుడు విని ముగ్గురూ అరుగుమీద కొచ్చారు.

'బామ్మ! బామ్మ!' అంటూ గంతులేస్తూ సీతమ్మ కాళ్ళను రాముం చుట్టేసుకున్నాడు.

మాలతి ఆపేక్షతో చిన్నగ నవ్వింది.

చలపతి తనమీది బరువు దిగినట్టు తృప్తిగా నిట్టూర్చాడు.

రవణ అందరిముందు ఠీవిగా నిలబడ్డాడు.

'అక్కడే నిలబడిపోయావే నాయనా? లోపలికి రా!' అంది సీతమ్మ.

'తిరుగుబండిలో తిరిగి వెళ్ళాలండి. కాలేజీకి సెలవుపెడితే బాగుండదు!' అన్నాడు రవణ.

'అమ్మా ఈ మహాడు రోజుల్లో ఎంత చిక్కిపోయావు! నీ చిరకాలవాంఛ నెరవేరిందా?'

'ఇదుగో ఈ అబ్బాయికనక లేకపోతే నేను చిక్కుపాట్ల మాట అటుంచి, పరలోకం చేరేదాన్ని. దైవంలా వచ్చి కాపాడాడు'

'అలాగా! చాలా థాంక్స్! వెరి కైండ్

ఆఫ్ యూ—బయటే నిలబడిపోయారు లోపలికి రండి!'' అన్నాడు రవణతో కరచాలనం చేస్తూ.

'కాదండి..... నేను వెళ్ళాలి!' అని నసిగాడు.

'అదంతా నాకు తెలియదు....మా యింట్లో ఎంగిలి పడకుండా వెళ్ళనివ్వను.' అంది సీతమ్మ.

రవణ అయిష్టంతో ఇంట్లోకి వచ్చాడు.

ఉతికినబట్టలారేస్తున్న పనిమనిషి కనిపించింది.

'ఇదెప్పట్నుంచి?' అనడిగింది సీతమ్మ.

'మీరు వెళ్ళినప్పట్నుంచీ' అంది మాలతి.

'ఎందుకు?........' సీతమ్మ ఆశ్చర్యపోయింది.

'అమ్మా!.....తిరుపతికి వెళ్ళేముందు నామీద విరుచుకుపడ్డావు. అప్పుడే మర్చిపోయావా?.... ఇక ఇంటి చాకిరీ తగ్గుతుంది......అంతేకాదు. హాయిగా విశ్రాంతి తీసుకో!.....ఇంతకాలం నీ వయసును గుర్తించకుండా బాధపెట్టాం. క్షమించు!'

'నిన్ను క్షమించాలంటే ఒక్క పని చెయ్యి!'

ఏమిటన్నట్టు చూశాడు చలపతి.

'ముందా పనిమనిషికి ఇవ్వాల్సిన జీతం ఇచ్చేసి పంపేయి. నాకు విశ్రాంతి కావలసినప్పుడు నేనే తీసుకుంటాను. ఈ ఇంట్లో నాకు సంపూర్ణ స్వాతంత్ర్యంవుంది.......అదలావుంచి, ఈ అబ్బాయికి మనం ఎంతివ్వాలో కనుక్కో.....'

'అబ్బే!......అదేం వద్దండి!' అన్నాడు రవణ.

అందరూ ముసిముసినవ్వులు విసిరారు సీతమ్మ అయోమయంగా చూసింది.

'ఏమిట్రా!.....ఏదైనా నాటకం ఆడావా ఏమిటి?'

'ఏం నాటకం అమ్మా?......ఈ జగమే ఓ నాటకం. అందులో మనమంతా పాత్రధారులం.'

ఒక్క సీతమ్మ తప్పించి అందరూ విరగబడి నవ్వారు.

'అన్నయ్యా!......' అంటూ గోపి వదిన్ని పాక్కుంటూ పరుగెత్తుకొచ్చాడు.

అన్నయ్య మాట్లాడకపోయేసరికి 'ఎప్పుడొచ్చావన్నయ్యా?.......నన్ను మాత్రం ఎందుకు తీసుకెళ్ళలేదు?....... అమ్మతో చెప్పాను. నీ భరతం పడతానంది......నువ్వొచ్చావని గోపి అంటే పరుగెత్తుకొచ్చాను.' అన్నాడు.

ఇక రహస్యాన్ని దాచివుంచి ప్రయోజనంలేదని గ్రహించి చలపతి మొదలుపెట్టాడు.

'అమ్మా!......నన్ను క్షమిస్తానంటే అంతా వివరిస్తాను.'

సీతమ్మ తల నిలువుగా ఆడించింది.

'నువ్వు తిరుపతి వెళ్ళాలని మొండిపట్టుపట్టావు. నిన్ను అడ్డుకోటంవలన మామీదుండే తప్పు టభిప్రాయాలు మరింత దృఢతరమౌతాయనే భయంతో వూరుకున్నాను.....కాని, ఒంటరిగా నీ వూరు వెళ్ళి ఎవరుగనిదానవు. ఎక్కడెలా అవస్థలుపడతావోనని చాలా బాధపడ్డాను. ఆఫీసులో ఆడిటింగు జరుగుతోంది. మూడురోజులపాటు అటువుంటే, మూడు గంటలుకూడా సెలవివ్వరు—ఈ రవణ మన అకౌంటెంటు రత్నంగారి కొడుకు. కాలేజీలో చదువుకుంటున్నాడు. పరీక్షలై సెలవుల్లో వున్నాడు. నీకు సాయపడమని వేడుకున్నా. చాలా మంచివాడు. కనక సరే నన్నాడు. నువ్వెక్కినరైల్లోనే నిన్ను వెంబడించాడు. అతని ఉపకారం నేను జన్మలో మరవను.....ఇలా ఏర్పాటు చేసినా కూడా మాలతి నేనూ ఈ మూడు రోజులు సరిగ్గా నిద్రపోతే ఒట్టు......ఆ ఏడుకొండలవాడే నన్ను కాపాడాడు......రత్నంగారు పక్కవీధిలో వున్నారు. నువ్వాయన్ను చూసేవుంటావు.'

సీతమ్మ ఓ నిమిషంపాటు రాయిలా కూర్చుంది.

'అయితే ఆ రెండువందలు మాయంచేసింది కూడా నువ్వేనా బాబా!' అంది నవ్వుతూ.

'రామ.....! రామ!.. ఆ పనిమాత్రం నేను చేయలేదండోయ్! మీకు చేసిన సాయానికి రుణం తీర్చుకోలేనన్నారు.....ఇలాగేనా నింద వేయటం?'

మాలతి నెస్కఫే కాఫీ తీసుకొచ్చింది అందరికీ.

'అత్తయ్యా!......మరో సంగతి చెప్పటం మరిచాను. లక్ష్మమ్మగారు కొడుకూ, కోడలూ పోట్లాడి వేరేవుంటోంది.'

సీతమ్మ 'ఏమిటేమిటి?' అంటూ ముక్కుమీద వేలేసుకుంది.

'ఎవరూ?....ఈ వీధిలో వుండే లక్ష్మమ్మా?... రోజూ సినిమాకు డ్రామాకి తీసికెళ్ళమని కొడుకును చంపుకు తింటుండట. ఎంత కాలమని వాళ్ళు మాత్రం సహించగలరు?...... కోడలు జ్వరంతో మంచంపడితే కాస్త జావ కూడా కాచివ్వలేదట' అన్నాడు రవణ.

'ఒకరి సంసారపు గొడవలు మన కెందుకు?... మనం ఒకర్నొకరు అర్థం చేసుకుని హాయిగా వుందాం' అంది సీతమ్మ.

'అయితే రవణా!......నువ్వు స్నానం చేసి వచ్చేయ్. ఈ పూట భోజనం ఇక్కడే!' అన్నాడు చలపతి.

'అంతకంటేనా?......' అంటూ రవణ బయలుదేరాడు.

చలపతికి తనమీదుండే ప్రేమాభిమానాలు రవణరూపంలో నడిచి పోతున్నట్టనిపించి వుంది సీతమ్మకు.

'బామ్మా! ...రాముంలారు అడవికి పోయిన తరువాతి కథ ఇవేళ చెప్పాలి సుమా!' అన్నాడు రామం.

సీతమ్మ మాట్లాడలేదు.

ఆమె ముఖంలో కనిపించిన వో కొత్త వెలుగులో, తృప్తి, ఆనందం, అనురాగం, ఆప్యాయం, సహనం, శాంతం ఇంకా ఎన్నో కరిగి నిండుదనంగా ప్రకాశించాయి.

పాహాడు గడియారాలూ ఒక్కసారిగా తొమ్మిది కొట్టాయి. ●

